

పోరుబాటలో ఆదివాసీలు

ఆదివాసీలు పోరుబాటకు సై అంటున్నారు. ప్రత్యేక డీఎస్సీతోపాటు ఇతర డిమాండ్లు నెరవేర్చాలంటూ ఐటీడీఏ ఎదుట నేడు మహాధర్నా చేపట్టనున్నారు. 8లో▸



పోచమ్మా.. సల్లంగ సూడమ్మా

జిల్లాలో పలుచోట్ల పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నెత్తిన బోనాలతో ఆలయాలకు చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా 'శ్యామా ప్రసాద్' వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: పూర్వ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రజనీశ్ జైన్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారావు, నాయకులు బోయిని హరికృష్ణ, రెడ్డిమల్ల అశోక్, కృష్ణమూర్తి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గైనకాలజిస్టు పోస్టుకు 28న ఇంటర్వ్యూ

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్యమిషన్ కింద చెన్నూరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో గైనకాలజిస్టు పోస్టు భర్తీ కోసం ఈ నెల 28న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో అనిత ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ డీజీవో, ఎండీ (అబస్టెట్రిక్స్, గైనకాలజిస్టు, అల్ట్రాసౌండ్(సోనోగ్రాఫర్) ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.1.30 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు కలెక్టరేట్‌లో సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 325 మంది హాజరు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో ఆదివారం టీజీ పాలిసెట్–2024లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల వివరాలను అధికారులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. రెండో రోజు కౌన్సెలింగ్‌కు 325 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి వెల్లడించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యూనియన్ బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: పండిత్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడ్ ప్రక్రియపై కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకున్నందున పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 20 ఏళ్లుగా పరిష్కారం కాని అప్‌గ్రేడ్ ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో పూర్తి చేసిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీర్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఉపాధ్యాయ సంఘ నేతలు

టీచర్ల పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రత్యేక చొరవ చూపిన సీఎం రేవంత్‌రెడ్డిని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా నేతలు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితరులున్నారు.

'పదోన్నతులు కల్పించకపోవడం అన్యాయం'

ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్, పీడీ పదోన్నతుల్లో అర్హత కలిగిన ఎస్జీటీలకు అవకాశం కల్పించకపోవడం అన్యాయమని ఎస్జీటీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకర్ అన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టుల్లో పదోన్నతులు పొంది విధుల్లో చేరని మిగిలిన ఖాళీల్లో సీనియారిటీ ప్రకారం ఎస్జీటీలతో భర్తీ చేయాలని కోరారు. ఇందులో ఉపాధ్యాయులు రంజిత్, కిరణ్, శ్రీనివాస్ ఉన్నారు.

సెల్లార్‌పై ఫోకస్



స్థలం లేక రోడ్డు మధ్యలో వాహనాల పార్కింగ్

ఈ నెల 14వ తేదీన మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. మార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు స్థలం లేదన్నారు. సెల్లార్లను పార్కింగ్‌కు వినియోగించాల్సి ఉన్నా, యజమానులు వాటిని గోదాములు, ఇతర దుకాణాల కోసం అద్దెకు ఇస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దుకాణాదారులతో పాటు, మార్కెట్‌కు వచ్చే వారు వాహనాలను రహదారి మధ్యలో పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడుతున్నాయని అన్నారు. సెల్లార్లను పార్కింగ్‌కు వినియోగించని వారందరికీ నోటీసులు జారీ చేసి, మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు బల్దియా అధికారులు సెల్లార్లపై ఫోకస్ పెట్టారు. చర్యలకు సిద్ధమవుతున్నారు. – మంచిర్యాలటౌన్

- జిల్లా కేంద్రంలో పార్కింగ్ తిప్పలు
- మార్కెట్లోకి వాహనాలు వెళ్లలేని దుస్థితి
- ఇతర అవసరాలకు సెల్లార్‌ను అద్దెకిస్తున్న యజమానులు
- ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి 'మున్సిపల్'
- నోటీసులు సిద్ధం చేస్తున్న బల్దియా అధికారులు





జిల్లా కేంద్రంలోని పలు షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్లలో ఏర్పాటు చేసిన దుకాణాలు

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో వాహనాల పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. ప్రత్యేకంగా స్థలం కేటాయించకపోవడం, సెల్లార్లను పార్కింగ్ కోసం వదిలేయాల్సి ఉన్నా, ధనార్జనే ధ్యేయంగా కొంత మంది వాటిని ఇతర అవసరాలకు అద్దెకిస్తున్నారు. దీంతో రహదారి మధ్యలోనే వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు ఏటా బతుకమ్మ, దసరా, దీపావళి తదితర పండుగల సమయాల్లో మార్కెట్‌లో రద్దీ పెరుగుతోంది. దీంతో ఈ మార్గంలో కనీసం నడవలేని పరిస్థితి తలెత్తుతుంది. మరోవైపు ఈ ప్రాంతంలోనే పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వెలుస్తున్నాయి. నిర్వాహకులు పార్కింగ్ కోసం సెల్లార్లను వినియోగించకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మార్కెట్‌కు వచ్చి వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు. జిల్లానుంచే కాకుండా మహారాష్ట్ర, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఇక్కడికి షాపింగ్ కోసం జనం ప్రత్యేక వాహనాల్లో వస్తుంటారు. రద్దీకి అనుగుణంగా రోడ్లు లేకపోవడం, పార్కింగ్ కోసం మున్సిపల్ అధికారులు సైతం ఎక్కడా స్థలం కేటాయించక పోవడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. మార్కెట్ ఏరియాలోనే మున్సిపాలిటీకి సంబంధించిన స్థలం ఉండగా అందులో కూరగాయల మార్కెట్, వివిధ షెట్టర్లను నిర్మించి అద్దెకిచ్చారు. కనీసం అక్కడైనా పార్కింగ్‌కు వెసులుబాటు కల్పించి ఉంటే ట్రాఫిక్ ఇబ్బందులు కొంతవరకైనా తొలగేవి.

సెల్లార్లలోనూ షాపులే..!

మున్సిపల్ పరిధిలోని మార్కెట్ ఏరియాలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లన్నింటికీ సెల్లార్ల నిర్మాణం చేపడుతున్నారు. వాటిని కేవలం పార్కింగ్ కోసమే వినియోగించాల్సి ఉన్నా యజమానులు మాత్రం వివిధ రకాల షాపులకు అద్దెకు ఇస్తున్నారు. గత్యంతరం లేక వాహనదారులు రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేస్తుండడంతో వారిపై అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారు సెల్లార్లను పార్కింగ్ కోసం వినియోగించని వారికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

నోటీసులు సిద్ధం చేశాం



సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలి. అయితే కొందరు అందులో షాపులు నిర్వహిస్తున్నారు. మరికొందరు గోదాములుగా వినియోగిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారందరికీ నోటీసులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం 18 భవనాలకు నోటీసులు జారీ చేసి, వారం గడువు ఇచ్చి అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

సాగుకు హస్తం.. 'రైతునేస్తం'

- జిల్లాలో మరో 12 వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు
- ఇప్పటికే నాలుగు రైతు వేదికల్లో నిర్వహణ
- ప్రతీ మంగళవారం శాస్త్రవేత్తలు, అధికారులు అందుబాటులోకి..
- అన్నదాతకు సలహాలు, సూచనలు



రైతునేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అప్పటి కలెక్టర్, అధికారులు, రైతులు (ఫైల్)



రెండో విడతలో ఎంపికైన హాజీపూర్ క్లస్టర్‌లోని గుడిపేట రైతువేదిక

మంచిర్యాలరూరల్/దండేపల్లి: రైతులకు సాగులో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం 'రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం అన్నదాతల కోసం రైతువేదికలను అందుబాటులోకి తీసుకురాగా వీటిని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దేలా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన రైతు వేదికల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ప్రతీ మంగళవారం నిర్దేశిత వేదికల్లో సమీప ప్రాంతాల ఆదర్శ రైతులను సమీకరించి, ప్రస్తుత సీజన్‌లో ఎదురయ్యే సమస్యలతో పాటు, విత్తనాల ఎంపిక, ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో తొలివిడతగా నాలుగింటిని వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా ఎంపిక చేయగా తాజాగా రెండో విడతలో మరో 12 ఎంపికయ్యాయి.

ఉపయోగ పడే అంశాలపై అవగాహన

ఎంపిక చేసిన కేంద్రాల్లో రైతులకు సాగులో ఉపయోగపడే అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం ఆయా వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. రైతులు ఎటువంటి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి, పత్తి సాగులో అధిక సాంద్రత విధానం తదితర అంశాలతో పాటు ప్రతీ మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణుల ఆధ్వర్యంలో అన్నదాతకు అనుభవ పాఠాలు నేర్పిస్తున్నారు. అలాగే రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తలకు నివేదించి సందేహాలను నివృత్తి చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

రెండో విడతలో మరో 12

వీడియో కాన్ఫరెన్స్ సేవలకు సంబంధించి జిల్లాలో ప్రయోగాత్మకంగా తొలి విడతలో డివిజన్‌కు ఒక రైతు వేదికను ఎంపిక చేశారు. మంచిర్యాల డివిజన్‌లో లక్సెట్టిపేట, బెల్లంపల్లి డివిజన్‌లో కన్నాలబస్తీ, భీమిని డివిజన్‌లో భీమిని, చెన్నూర్‌లో చెన్నూర్ రైతు వేదికలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. రెండో విడతలో క్లస్టర్‌కు ఒకటి చొప్పున మరో 12 వేదికలకు విస్తరించారు. జన్నారం క్లస్టర్‌లోని జన్నారం రైతువేదిక, దండేపల్లి మండలం వెల్గనూర్ క్లస్టర్ పరిధిలోని ద్వారక, నస్పూర్ క్లస్టర్ పరిధిలోని సీతారాంపల్లి, హాజీపూర్ క్లస్టర్ పరిధిలోని గుడిపేట, ఇందారం క్లస్టర్‌లోని ఇందారం, భీమారం క్లస్టర్‌లోని భీమారం, మందమర్రి మండలంలోని మందమర్రి, కోటపల్లి క్లస్టర్‌లోని కోటపల్లి, కాసిపేట క్లస్టర్‌లోని ముత్యంపల్లి, తాండూర్ క్లస్టర్‌లోని కొత్తపల్లి, నెన్నెల క్లస్టర్‌లోని ఆవడం, కన్నెపల్లి క్లస్టర్‌లోని కన్నెపల్లి, వేమనపల్లి క్లస్టర్‌లోని వేమనపల్లి ఉన్నాయి. ఇక మీదట ఇవి కూడా వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మారనున్నాయి.

సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు..



జిల్లాలో తొలివిడతలో నాలుగు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సేవలను అందుబాటులోకి రాగా తాజాగా మరో 12 వేదికలు కూడా ఎంపికయ్యాయి. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా అన్నదాతలు సాగులో ఎదురవుతున్న సమస్యలను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులకు నివేదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ప్రతీ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరవ్వాలి. ఇందులో ఆదర్శ రైతులు, అధిక దిగుబడులు సాధించిన వారు సాగు పద్ధతులు వివరిస్తున్నారు. కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి.

– సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి, మంచిర్యాల

కౌలు రైతు.. కష్టాల సాగు



దున్నడానికి వెళ్తున్న కౌలు రైతు

- వర్తించని ప్రభుత్వ పథకాలు
- రాయితీలు వర్తించవు.. రుణాలూ అందవు
- జిల్లాలో 28,584 మంది



నాగలి పట్టుకొని వెళ్తున్న కౌలు రైతు

నెన్నెల: కౌలు రైతులు సాగులో కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఏటా పెట్టుబడులు పెరిగి.. ప్రభుత్వ ప్రోత్సాహం కరువై నష్టాలు చవి చూస్తున్నారు. పుడమిని నమ్ముకుని స్వేదం చిందించినా అప్పులే మిగులుతున్నాయి. సాగు బలోపేతం దిశగా ప్రభుత్వం అమలులోకి తెస్తున్న పెట్టుబడి పథకంతోనైనా అండ దొరుకుతుందనుకునే తరుణంలో కౌలు రైతు ఆశలు ఆవిరయ్యాయి. కోటి ఆశలతో సాగుతున్న కౌలు రైతులను కష్టనష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. జిల్లాలో 28,584మంది కౌలురైతులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా. కొత్త ప్రభుత్వం కౌలురైతులకు రైతుభరోసా అందిస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించడంతో ఈసారైనా అందుతుందేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. కౌలురైతులు గుర్తింపు కార్డులకు నోచుకోక ప్రభుత్వం అందించే రాయితీలు వర్తించడం లేదు. పంటల రుణాలు అందక, పంటల బీమా సౌకర్యం లేక పంటలు నష్టపోయిన సమయంలో పరిహారం అందడం లేదు. ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25వేలు చెల్లించి కౌలుకు తీసుకుంటున్నారు. ఈ ధరలు ఏటేటా పెరుగుతున్నాయి. అయినా జీవనాధారం కోసం ఐదు నుంచి పదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు.

పెట్టుబడులూ రావడంలేదు



మా గ్రామానికి చెందిన భూస్వామి వద్ద 10 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాను. ఎకరానికి రూ.20 వేలు చెల్లించాను. ఇంతవరకు గుర్తింపు కార్డు ఇవ్వలేదు. పంట రుణాలు అందడం లేదు. గతేడాది రూ.లక్ష నష్టం వచ్చింది. పెట్టుబడులు కూడా మిగలలేదు. ఇప్పుడు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకుంటే మా పరిస్థితి అగమ్యగోచరమే. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేసి పెట్టుబడి సాయం అందించాలి.

– అబ్బర్ల శ్రీను, కౌలు రైతు, నెన్నెల

ఆసరా అవుతుందని సంతోషపడ్డాను



ఏళ్లుగా కౌలు భూముల పైనే ఆధారపడి రెక్కల కష్టాన్ని చిందిస్తున్నాం. బ్యాంకు ల నుంచి రుణసా యం లేకపోవడంతో ప్రైవేట్ పెట్టుబడులే దిక్కుగా మారాయి. ప్రభుత్వం వానకాలం సాగు నుంచి పెట్టుబడి సాయం కౌలు రైతులకు అందిస్తామనడంతో కాస్త ఆసరా అవుతుందని సంతోషపడ్డాం. కానీ ఇప్పట్లో అందించేలా లేదు. అప్పు కోసం ప్రైవేట్ వ్యక్తుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. క్షేత్రస్థాయిలో సర్వే చేసి కౌలు రైతులను గుర్తించి సాయం అందించాలి.

– మల్లేశ్, కౌలు రైతు (నెన్నెల)

కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు గుర్తింపు



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి, తనకు కార్యకర్తలే బలమని, వారికి తగిన ప్రాధాన్యత కల్పించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని అన్నారు. రానున్న ఐదేళ్లలో మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం మార్కెట్ కమిటీ జిల్లా అధికారి గజానంద్ నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యేతో పాటు డీసీసీ అధ్యక్షురాలిని పాలకవర్గ సభ్యులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పయ్యావుల పద్మ, వైస్‌చైర్మన్‌గా బండారి సుధాకర్, డైరెక్టర్లుగా తాజమ్ముల్, శ్రీనివాస్, సావిత్రి, రమేశ్ నాయక్, సతీశ్, సత్యనారాయణ, సంతోశ్, లింగయ్య, మల్లేశ్, జనార్దన్, కుమార్‌జాజు, ఆర్. మహేశ్, రామారావు ప్రమాణ స్వీకారం చేశారు.

బొగ్గు గనులు సింగరేణికే కేటాయించాలి

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు

శ్రీరాంపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ఎన్ దివాకర్‌రావు డిమాండ్ చేశారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని శ్రావణ్‌పల్లి బొగ్గు గనిని కేంద్రం వేలం వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు అన్వేషణ చేస్తే దాన్ని కేంద్రం వేలం వేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతుందన్నారు. దీన్ని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. నాడు నాలుగు బొగ్గు బ్లాకులను కేంద్రం వేలం వేస్తే ఒక్కబొగ్గు పెళ్లను కూడా రాకుండా అడ్డుకుంటామని చెప్పడంతో బిడ్డింగ్‌లో సంస్థలు పాల్గొనకుండా వెనక్కు వెళ్లాయన్నారు. దీనిపై అప్పుడు బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్‌లు కేంద్రంతో పోరాడాయన్నారు. అయితే గతంలో బొగ్గుగనుల వేలంను వ్యతిరేకించిన కాంగ్రెస్ నేడు అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీకి మద్దతుగా వేలం ప్రక్రియకు సహకరించిందన్నారు. ఈ ద్వంద్వ విధానం సరికాదన్నారు. ఇందులో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, పార్టీ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, సుబ్బయ్య, పవన్‌కుమార్, రాజేశం, సత్తయ్య, కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో మట్కా ఆడుతున్న అఫ్తాబ్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. ఇందిరా మార్కెట్‌కు చెందిన అఫ్తాబ్ హుస్సేన్ మట్కా ఆడుతూ పట్టుబడగా, ఏడు మట్కా చిట్టీలు, రూ. 800ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన కల్వచర్ల రాజుపై దాడి చేసిన రాచర్ల శ్రీనివాస్, శివలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. ప్రహరీగోడ విషయంలో వాగ్వాదం జరగడంతో దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటర్ చోరీ



బోర్ మోటర్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన కొండగుర్లె రాజ్‌కుమార్ అనే రైతుకు చెందిన రూ.20 వేల విలువ గల విద్యుత్ మోటర్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఆదివారం తెలిపారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ చేనులో బోర్‌కు బిగించిన విద్యుత్ మోటర్‌ను శనివారం రాత్రి దుండగులు దొంగిలించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ మోటర్లను దొంగలు వరుసగా చోరీలు చేసి అమ్ముకుంటున్నారని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. కౌటాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సిల్వర్ మెడల్



పతకంతో మహతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన వెరబెల్లి రవీందర్ రావు– ఉమాదేవిల కూతురు మహతి ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన 10మీటర్ల రైఫిల్ షూటింగ్ జూనియర్ మహిళా, జూనియర్ విభాగాల్లో రెండోస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయిలో రాణించిన మహతికి రాష్ట్ర మాజీ డీజీపీ అంజనీ కుమార్ మెడల్ అందించారు. మహతి ప్రస్తుతం పూణేలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది.

పోరుబాటలో ఆదివాసీలు

- ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్
- పట్టాల కోసం పోడురైతుల ఆందోళన
- గిరిపుత్రుల గోడు పట్టించుకోని ప్రభుత్వాలు
- నిరసనలకు పిలుపునిచ్చిన తుడుందెబ్బ
- నేడు ఐటీడీఏ ఎదుట 'మహాధర్నా'



ఉట్నూర్‌లో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): 'పోరాడితే పోయేదేమిలేదు.. బానిస సంకెళ్లు తప్ప' అనే నానుడిని పునికి పుచ్చుకున్న ఆదివాసీ నిరుద్యోగులు పోరుబాటకు సై అంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా తమ గోడును పట్టించుకోవడం లేదని ఆదివాసీ నిరుద్యోగులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు లేక కుటుంబాల పోషణ భారమవుతుందని, తమకు దక్కాల్సిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడుతున్నారు. ఇందుకు ఆందోళనలే శరణ్యమని నమ్మి ఉద్యమాల బాట పడుతున్నారు. ఆదివాసీ పోడు రైతులు సైతం ప్రభుత్వాల చర్యలతో రగిలిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని పోరుబాటలో ఆదివాసీ నిరుద్యోగులతో జతకడుతున్నారు. ఇందుకోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో నేడు ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట మహాధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. గడిచిన వారం రోజులుగా ఆదివాసీ గ్రామాల్లో మహాధర్నాపై విస్తృత ప్రచారం నిర్వహించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులపై నిశ్శబ్దం

ఉట్నూర్ ఐటీడీఏలో సుమారు 1000 బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. కానీ ఇంత వరకు ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6459 మంది టీటీసీ, బీఎడ్ శిక్షణ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనరల్ డీఎస్సీ భర్తీ కోసం గిరిజన పోస్టులు 70 కూడా లేకపోవడం గమనార్హం. 2012లో నిర్వహించిన ఏజెన్సీ డీఎస్సీ తర్వాత ఇంత వరకు డీఎస్సీ నిర్వహించ లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గిరిజన ఆశ్రమ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో వేలల్లో ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. 2005 నుంచి ప్రారంభమైన సీఆర్టీ వ్యవస్థతోనే కాలం గడుపుతున్నారు తప్ప డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న చిత్తశుద్ధి లేకపోవడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఎక్కడికక్కడ నిరసనలు, ఉద్యమాలు చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. కానీ అధికారులు వీరి వినతులను చెత్తబుట్టల్లో పడేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లకు ఏళ్లుగా కోచింగ్ కోసం లక్షల రూపాయలు వెచ్చించి చదివిన చదువుకు అర్థం లేకుండా పోతుందని జనరల్ డీఎస్సీలో ఏజెన్సీ పోస్టులు లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలు తగ్గాయని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ డీఎస్సీపైనే ఆశలు పెట్టుకున్నట్లు వారు పేర్కొంటున్నారు.

ఏజెన్సీ చట్టాలు నిర్వీర్యం..

5వ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. భూబదాలయింపు చట్టం 1/70 ఏజెన్సీలో ఎక్కడా అమలు కావడం లేదు. పెసా చట్టాన్ని సైతం నిర్వీర్యం చేస్తున్నారు. చట్టాల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. 317 జీవోతో ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు ఉద్యోగాల్లో చేరడంతో స్థానికులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏజెన్సీ డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఆ మాట ఎత్తకపోవడం ఏంటని ఆదివాసీ నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు

- ఐటీడీఏలో మెగా డీఎస్సీ నిర్వహించాలి.
- బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.
- రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలి.
- మరోసారి పోడు సర్వే చేయించాలి.
- జీవో నెంబర్ 3ను యథావిధిగా కొనసాగించాలి.
- ఏజెన్సీ పోస్టులను గిరిజనులతో భర్తీ చేయాలి.
- 1/70ని పకడ్బందీగా అమలు చేయాలి.
- పెసా చట్టాన్ని రక్షించాలి.

పట్టాలు ఇచ్చే వరకు పోరాటం



ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములకు నేటికీ పట్టాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదివాసీలకు పోడు పట్టాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తాం. ఆదివాసీ చట్టాలు, హక్కులను ఎక్కడికక్కడ నిర్వీర్యం చేస్తున్నారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. హక్కుల రక్షణ కోసం రాష్ట్ర స్థాయిలో చర్చించి కార్యచరణ ప్రకటిస్తాం.

– కొడప నగేశ్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి



2012 తర్వాత నేటి వరకు ఐటీడీఏ ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించలేదు. దీంతో నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేలకు పైగా ఆదివాసీ నిరుద్యోగులు టీటీసీ, బీఈడీ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గతంలో చాలా సార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించాలి.

– పెందోర్ దీపక్, జైభారత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

పోడు పట్టాల కోసం నిరీక్షణ

ఏళ్లుగా పోడు భూములు సాగు చేస్తున్నప్పటికీ ఆదివాసీలకు పోడు పట్టాలు అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 35 వేల హెక్టార్లలో సుమారు 12వేల మంది గిరిజన రైతులు పోడు భూములు సాగు చేస్తున్నారు. వీరికి పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ఉన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పోడు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరుద్యోగులతో కలిసి పోరుబాట పట్టారు.

ఐటీడీఏ ముట్టడి విజయవంతం చేయాలి

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ నిర్వహించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని ఐటీడీఏ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్లతో సోమవారం తలపెట్టిన ఐటీడీఏ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొమురంభీం కాలనీలో నిర్వహించిన సమావేశంలో సంఘ బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. జీవో 3 ప్రకారమే బదిలీలు, పదోన్నతులను కల్పించాలని, పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, 5 వషెడ్యూల్ ప్రాంతంలో జీవో 317 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆదివాసీ నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు మేధావులు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉయిక సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

'ఆరుద్ర' ఆగమనం!



ఆరుద్రకార్తె శనివారం నుంచి ప్రారంభమైంది. ఆగమనంలోనే వాతావరణం చల్లబడింది. తొలకరి జల్లులు కురవడంతో అక్కడక్కడ పంట పొలాల్లో ఆరుద్ర పురుగుల రాక మొదలైంది. ఎరుపు రంగులో మెరిసిపోతూ, తాకితే మృదువుగా అనిపించే ఆరుద్ర పురుగులు దండేపల్లి సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం కనువిందు చేశాయి. – దండేపల్లి

అలరించిన 'అయోధ్యరామునికి నాట్యనీరాజనం'



అవార్డు అందుకుంటున్న నందిని నృత్యాలయ బృందం

మంచిర్యాలఅర్బన్: ఫ్రెండ్స్ ఇండియా కల్చరల్, సిటిజన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి నృత్యోత్సవం అయోధ్యరామునికి నాట్య నీరాజనం ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగింది. జిల్లా నుంచి కళాకారులు హాజరై పలు అంశాలను ప్రదర్శించారు. మంచిర్యాలకు చెందిన నందిని నృత్యాలయ బృంద కళాకారులు అలేఖీ, సాధిక, హర్షిత, మనస్వి, ఓజేస్వీ కూచిపూడినాట్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. కళాకారుల ప్రతిభకు అయోధ్య రామ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు సర్టిఫికెట్ అందించారు. సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, డాక్టర్ వేదాంతం రాదేశ్యాం, పశుమతి శేషుబాబు, దేవేంద్రపిళ్లై, ప్రభావతి తదితరులు హాజరయ్యారు.

'చట్టప్రకారం వేతనాలు చెల్లించాలి'



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు ఫ్యాక్టరీ చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం సంఘం బెల్లంపల్లి రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. సంస్థ అర్జించే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కీలకమని, అయినా వారికి వేతనాల చెల్లింపులో, లాభాల్లో వాటా చెల్లింపుల్లో వివక్ష చూపిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బ్రహ్మానందం, జాఫర్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనాలు

బెల్లంపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



దండేపల్లి: అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు



కొన్నేళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. బాల్య మిత్రులను ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులను నేర్పించిన గురువులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎక్కడెక్కడో వివిధ హోదాల్లో ఉన్న వారంతా కలుసుకొని జిల్లాలోని వివిధ మండలాల్లో అట్టహాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. 1996 –97లో బెల్లంపల్లి సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు, మందమర్రి పట్టణం మేదరిబస్తీలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 1986 –87లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998 –2000లో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003 –04లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు, జైపూర్ శ్రీచైతన్య హైస్కూల్‌లో 2008 –2009 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు.

– బెల్లంపల్లి/మందమర్రిరూరల్/ చెన్నూర్/ దండేపల్లి/జైపూర్



జైపూర్: శ్రీచైతన్య హైస్కూల్‌లో..



చెన్నూర్‌లో..



మందమర్రిరూరల్: 1986 -87లో ఏడో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు


రాడ్డు గుచ్చుకుని బాలుడు మృతి



రిశ్విత్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ఇంటి డాబాపై తోటి పిల్లలతో ఆడుకుంటున్న సమయంలో రాడ్డు పొట్టలో గుచ్చుకొని ఏడేళ్ల బాలుడు మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సరాండి గ్రామానికి చెందిన జాడి రషిక –భీంరావు దంపతుల కుమారుడు జాడి రిశ్విత్(7) గ్రామంలోని తోటి పిల్లలతో కలిసి ఆదివారం సాయంత్రం అదే గ్రామంలోని రషిక తండ్రి దుర్గం రమేశ్ ఇంటి డాబాపై ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో రిశ్విత్ ప్రమాదవశాత్తు మెట్ల దగ్గర జారి పడటంతో అక్కడున్న రాడ్డు పొట్టలో గుచ్చుకుంది. దీంతో తోటి పిల్లలు కేకలు వేయగా గమనించిన కుటుంబ సభ్యులు బాలుడుని వెంటనే వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన డాక్టరు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు ఆసిఫాబాద్‌లోని ఓ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. ఆడుకుంటూ బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన బాలుడి తల్లి రషిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

27 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు




మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని గ్రీన్‌సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 27 నుంచి 30 వరకు యూనిక్స్ సన్‌రైస్ పదో రాష్ట్రస్థాయి సీనియర్స్ మెన్, ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేసన్ వైస్ ప్రెసిడెంట్ బండ మీనారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఈ టోర్నీకి 300 మంది వరకు క్రీడాకారులు, మ్యాచ్ రిఫరీలు, అంపైర్లు, పీడీలు వస్తారని, ఇందులో పాల్గొనే వారందరికీ వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 27న క్వాలిఫైడ్ మ్యాచ్‌లు, 28 నుంచి 30 వరకు మెయిన్ డ్రా మ్యాచులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సత్యపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు కృష్ణ, సీనియర్ క్రీడాకారులు రవి పాల్గొన్నారు.

ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



శేషరాం



ముజీబోద్దీన్

జన్నారం: జన్నారం ఫారెస్ట్ అటవీ డివిజన్ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జన్నారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బీ.శేషరాం (ఎఫ్ఎస్ఓ, దొంగపల్లి), ఉపాధ్యక్షుడిగా లాల్‌బాయ్ (బీట్ అధికారి, మహ్మదాబాద్), ప్రధాన కార్యదర్శిగా ముజీబోద్దీన్ (బీట్ అధికారి, కలమడుగు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణారావు (సెక్షన్ అధికారి, కవ్వాల్), సంయుక్త కార్యదర్శిగా కృష్ణమూర్తి (బీట్‌అధికారి, మల్యాల్), కోశాధికారిగా అనిల్ (బీట్ అధికారి, దండెపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు అసోసియేషన్ జోనల్ కార్యదర్శి సుభాష్, సర్కిల్ రిప్రజెంటేటీవ్ అజార్‌లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నేరడిగొండ: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ జవహర్‌లాల్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మేత మేసేందుకు బయటకు వెళ్లిన గేదె తెగి పడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో కరెంట్ షాక్ తగిలింది.

ట్రిపుల్‌ఐటీకి 15వేలకుపైగా దరఖాస్తులు



బాసర ట్రిపుల్‌ఐటీ

- గతేడాదితో పోలిస్తే సగానికి తగ్గుదల
- ఈ నెలాఖరు వరకు పరిశీలన పూర్తి
- జూలై 3న ఎంపిక జాబితా వెల్లడి
- 8, 9, 10 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన

భైంసా: 2024–25 విద్యాసంవత్సరానికి బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి జూన్ 1నుంచి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. కళాశాలలో 1,500 సీట్లుండగా రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి 15వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు కళాశాల అధికారులు తెలిపారు. దరఖాస్తుల కచ్చిత సమాచారం త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పరిశీలించాకే ఎంపిక జాబితా

ఈనెలాఖరు వరకు దరఖాస్తులను పరిశీలించి ఎంపిక జాబితాను జూలై 3న ప్రకటిస్తామని ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లను జూలై 8,9,10 తేదీల్లో పరిశీలించి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

కోర్సు ఇలా..

ఆరేళ్ల సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో భాగంగా మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ తరగతులు బోధిస్తారు. పీయూసీలో వచ్చిన మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల బీటెక్ కోర్సులో వివిధ బ్రాంచ్‌లలో సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుంది. యూనిఫాంలు, షూస్, ల్యాప్‌టాప్ ఇస్తారు. విద్యార్థులు ఆటలు, కళలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తారు. కళాశాలలో ప్రత్యేక వైద్యశాల, అధునాతన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

సగానికి తగ్గిన దరఖాస్తులు

2020–21 విద్యాసంవత్సరంలో 32వేల మంది, 2021–22లో 20,178, 2022–23లో 31,432 మంది, 2023–24 విద్యాసంవత్సరంలో 32,635 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే దరఖాస్తుల సంఖ్య సగానికి తగ్గింది.